సాక్షి ఖమ్మం

శనివారం, 5, జూలై, 2025



రహ'దారి' కష్టాలు

మున్నేటిపై పాత బ్రిడ్జి మూసివేత, ప్రకాశ్‌నగర్ దూరాభారం కారణంగా రావర్తినగర్ బ్రిడ్జిపై భారం పెరిగి ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. 8లో



.. బలి తీసుకున్న మున్నేరు

వాహనాలను శుభ్రం చేద్దామని వెళ్లి మున్నేటిలోకి దిగిన అన్నదమ్ములు ఇసుక కోసం తవ్విన గుంతల్లో మునిగి కన్నుమూశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 26°

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పారాలీగల్ వలంటీర్లుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు

ఖమ్మం లీగల్: ఆసక్తి కలిగిన న్యాయ విద్యార్థులు పారా లీగల్ వలంటీర్లుగా నమోదు చేసుకుంటే అవసరమైన వారికి న్యాయసహాయం అందించొచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఖమ్మంలో శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన న్యాయ విద్యార్థులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన, న్యాయ సాయం కోసం ధనం వెచ్చించలేని వారికి సంస్థ ద్వారా ఉచిత సహాయం అందుతుందని తెలిపారు. ఈక్రమంలో విద్యార్థులు వలంటీర్లు నమోదైతే అర్హులకు సాయం అందేలా కృషి చేయొచ్చని చెప్పారు. న్యాయవాది పి.సంధ్యారాణి, మానేరు లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ నంద చిరంజీవి, అధ్యాపకులు నూరేన్, హరీశ్, రేహాన్, లావణ్య పాల్గొన్నారు.

సాగర్ నుంచి పాలేరుకు నీటి విడుదల



పాలేరులో 12 అడుగులకు పడిపోయిన నీటిమట్టం

నాగార్జునసాగర్/కూసుమంచి: పాలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గడంతో తాగునీటి సమస్య ఎదురుకాకుండా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి 3వేల క్యూసెక్కుల నీటి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం సాగునీటి శాఖ అధికారులు ప్రాజెక్టు ఎడమ కాల్వ ద్వారా నీరు విడుదల చేశారు. మొదట వేయి క్యూసెక్కులు విడుదల చేయగా, క్రమంగా మూడు వేల క్యూసెక్కులకు పెంచుతూ ఐదు రోజులు విడుదల చేస్తామని డ్యాం ఎస్‌ఈ మల్లికార్జున్ తెలిపారు. ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 12.30 అడుగులకు పడిపోగా, సాగర్ జలాలు శనివారం రాత్రి వరకు చేరనుండడంతో నీటిమట్టం పెరగనుంది. తద్వారా ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు తాగునీటి విడుదల సాఫీగా సాగనుంది.

డీసీఈబీ సెక్రటరీగా వెంకటేశ్వర్లు



కనపర్తి వెంకటేశ్వర్లు

ఖమ్మం సహకారనగర్: డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) సెక్రటరీగా కనపర్తి వెంకటేశ్వర్లును నియమిస్తూ డీఈఓ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చింతకాని మండలం నాగులవంచ హెచ్‌ఎంగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును సెక్రటరీగానే కాక మరో పది మందిని మూడేళ్ల కాలానికి సభ్యులుగా నియమించారు. సభ్యుల్లో జెడ్పీ, ప్రభుత్వ, కేజీబీవీ, రెసిడెన్షియల్, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు ఉన్నారు. కాగా, వెంకటేశ్వర్లు గతంలోనూ డీసీఈబీ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు. ఈమేరకు డీసీఈబీ కార్యదర్శి, సభ్యులను టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కట్టా శేఖర్‌రావు, రంగారావు, మొత్కూరి మధు, రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, ఏ.వీ.నాగేశ్వరరావు, వెంగళరావు, మొత్కూరి మధు, యలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

సర్టిఫికెట్ల పరిశీలన



ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)ల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ పోస్టుల భర్తీ ప్రక్రియ మొదలైంది. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించిన అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లను శుక్రవారం డీఈఓ కార్యాలయంలో పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు అజిత, శివకుమారి సర్టిఫికెట్లు పరిశీలించగా జీసీడీఓ తులసి పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మేమింతే.. మారమంతే



సీఎంఆర్ అప్పగింతలో కొందరు మిల్లర్ల నిర్లక్ష్యం

- 2024–25 వానాకాలం గడువు ముగిసినా 16శాతం బకాయి
- యాసంగి సీజన్‌లోనూ 60 శాతమే..
- హెచ్చరికలే తప్ప చర్యలు లేకపోవడంతో ఇష్టారాజ్యం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రభుత్వానికి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను అందించడంలో కొందరు మిల్లర్లు నిర్లక్ష్యాన్ని వీడడం లేదు. సకాలంలో బియ్యం అప్పగించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించడం.. ఆతర్వాత చర్యల్లో పురోగతి లేకపోవడంతో పరిస్థితులు మారడం లేదు. 2024–25 వానాకాలం సీజన్‌కు సంబంధించి గడువు ముగిసినా మరో 16 శాతం సీఎంఆర్ బకాయి ఉన్నారు. ఇక యాసంగికి సంబంధించి ఇప్పటి వరకు 60శాతం మాత్రమే అందింది. ప్రధానంగా కొన్ని మిల్లులు మొద్దు నిద్రను వీడకపోవడం.. ప్రభుత్వం గడువు పెంచడం పరిపాటిగా మారుతున్నా ఈ ఏడాది ఇంకా ప్రకటన మాత్రం రాలేదు.

మరోసారి పెంచుతారా..

గడువు ముగిసినప్పటికీ సీఎంఆర్ అప్పగించని మిల్లర్లపై ప్రభుత్వం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఏటా ఇదే పరిస్థితి ఉత్పన్నమవుతుండగా, మరోసారి గడువు పెంచుతారులే అన్న ధీమాతో మిల్లుల యాజమాన్యాలు ఉంటున్నాయి. ఏటా గడువు ముగియగానే మరోసారి ప్రభుత్వం సమయం ఇస్తున్నా ఈసారి ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే, 16 శాతం సీఎంఆర్ సేకరణకు ప్రభుత్వం గడువు పెంచుతుందని అధికారులు భావిస్తున్నారు.

యాసంగిలో 60 శాతం..

ఇక 2024–25 ఏడాది యాసంగి సీజన్ సీఎంఆర్ ఇప్పటి వరకు 60 శాతం అందజేశారు. ఈ సీజన్‌లో 4,55,981.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌర సరఫరాల సంస్థ ద్వారా మిల్లర్లకు అందజేయగా.. 3,05,743.351 మెట్రిక్ టన్నుల బియ్యం తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో 1,84,444.836 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించారు. మరో 1,21,298.515 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేయాల్సి ఉండగా.. ఈ ఏడాది సెప్టెంబర్ వరకు గడువు ఉంది. కానీ రెండు నెలల్లో 40 శాతం బియ్యం మిల్లర్లు అందజేస్తారా, లేదా అన్నది వేచి చూడాల్సిందే.

వానాకాలం గడువు ముగిసినా..

2024–25 వానాకాలం సీజన్‌లో 2,95,605 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం జిల్లాలోని 66 మిల్లులకు అందజేశారు. ఈ ధాన్యంలో క్వింటాకు 67 శాతం చొప్పున 1,98,066.880 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. బియ్యం అప్పగించే గడువు జూన్‌తోనే ముగిసినా ఇప్పటి వరకు 1,66,090.086 మెట్రిక్ టన్నుల బియ్యమే(84శాతం) అప్పగించారు. ఇంకా 31,976.794 మెట్రిక్ టన్నుల బియ్యం ఎప్పుడిస్తారో స్పష్టత రావడం లేదు. ఇందులో పాఠశాలలు, వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందించాల్సిన సన్నబియ్యం ఉండడం.. మిల్లర్లు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నా అధికారుల నుంచి చర్యలు లేకపోవడం గమనార్హం.

కొందరు మిల్లర్ల తీరుతో..

జిల్లాలోని 66 మిల్లులకు పౌర సరఫరాల సంస్థ రెండు సీజన్లలో సీఎంఆర్ కోసం ధాన్యం అందజేస్తోంది. ఈ ధాన్యం అందించిన మూడు నెలల్లోగా బియ్యం అప్పగించాలనే నిబంధన ఉంది. అధికసంఖ్యలో మిల్లుల యాజమాన్యాలు గడువులోగా బియ్యం అందించే ప్రయత్నాలు చేస్తున్నా.. కొన్ని మిల్లుల యాజమాన్యాలు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా సకాలంలో సీఎంఆర్ అందజేయని కొన్ని మిల్లులపై గత ఏడాది టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులు నిర్వహించాయి. ఈమేరకు బియ్యం దారి మళ్లించినట్లు గుర్తించాయి. అయితే, అప్పుడప్పుడు కాకుండా ఏటా సీజన్ల వారీగా తనిఖీలు చేపడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటే సకాలంలో సీఎంఆర్ సేకరణ సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఒత్తిడి తీసుకొస్తాం..



జిల్లాలో లక్ష్యం మేర సీఎంఆర్ సేకరణకు అన్నిచర్యలు తీసుకుంటున్నాం. 2024–25 వానాకాలం సీజన్‌కు సంబంధించి మిల్లర్లు సీఎంఆర్ ఇచ్చే గతనెల 30తో ముగిసింది. ఇంకా బకాయి ఉన్న మిల్లర్లపై ఒత్తిడి తీసుకొస్తూ త్వరగా సీఎంఆర్ సేకరణ పూర్తిచేస్తాం. యాసంగికి సంబంధించి సెప్టెంబర్ వరకు గడువు ఉన్నందున ఆలోగా లక్ష్యం మేర వసూలు చేస్తాం. – చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

భళా.. ప్రభుత్వ పాఠశాల



నయాబజార్ హైస్కూల్‌లోని తరగతి గదిలో విద్యార్థులు

- ఈ ఏడాది పెరిగిన 1,886మంది విద్యార్థులు
- కొణిజర్ల, చింతకాని, వైరాలో తప్ప అన్ని చోట్ల పెరుగుదల
- ప్రథమ స్థానంలో ఖమ్మం రూరల్ మండలం

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడం.. నాణ్యమైన విద్య, ఉచితంగా యూనిఫామ్, పౌష్టికాహారం అందిస్తున్నామని చేసిన విస్తృత ప్రచారంతో మెరుగైన ఫలితాలు కనిపిస్తున్నాయి. ఈమేరకు జిల్లాలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి గత విద్యాసంవత్సరం కంటే ఈ ఏడాది 1,886మంది విద్యార్థులు పెరిగారు. గత విద్యాసంవత్సరం(2024–25)లో 66,289మంది ఉండగా... ఈసారి(2025–26) ఆ సంఖ్య 68,175కు చేరింది.

అత్యధికంగా ఖమ్మం రూరల్

ఈ విద్యాసంవత్సరం జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలంలో అత్యధికంగా 359మంది విద్యార్థులు పెరిగారు. అతి తక్కువగా మధిర మండలంలో ఆరుగురే పెరిగారు. ఇక కూసుమంచి మండలంలో 318, ఖమ్మం అర్బన్‌లో 218, సత్తుపల్లిలో 167, సింగరేణిలో 158, పెనుబల్లిలో 121, కల్లూరులో 105, బోనకల్‌లో 104, ఎర్రుపాలెంలో 91, ఏన్కూరులో 75, ముదిగొండలో 63, వేంసూరులో 59, నేలకొండపల్లిలో 44, తిరుమలాయపాలెంలో 39, రఘునాథపాలెంలో 29, తల్లాడలో 15, కామేపల్లిలో 11మంది విద్యార్థులు గత ఏడాది కంటే ఎక్కువగా నమోదయ్యారు.

ఇక్కడ తగ్గారు...

జిల్లాలోని కొణిజర్ల మండలంలో 60మంది, చింతకానిలో 33మంది, వైరాలో ముగ్గురు విద్యార్థులు గత ఏడాదితో పోలిస్తే తగ్గడం గమనార్హం. గత విద్యాసంవత్సరం కొణిజర్ల మండలంలో 3,294 మంది ఉండగా ఈసారి ఆ సంఖ్య 3,234కి పడిపోయింది. చింతకాని మండలంలో గత విద్యాసంవత్సరం 2,849మంది ఉండగా 33మంది తగ్గారు. అలాగే, వైరా మండలంలో గత ఏడాది 2,634మంది ఉండగా ఈ ఏడాది 2,631మందికి చేరారు.



ఎన్నెస్పీకాలనీ ప్రాథమిక పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

జిల్లా కేంద్రంలో ముందస్తు ప్రచారం

బడిబాట కార్యక్రమం ఖమ్మం అర్బన్ మండలం (జిల్లా కేంద్రం)లో సత్ఫలితాలు ఇచ్చింది. నగరంలో 75ప్రభుత్వ పాఠశాలలు ఉండగా గత ఏడాది 9,420మంది విద్యార్థులు చదివారు. ఈసారి ఆ సంఖ్య 9,639మందికి చేరడం విశేషం. ఇందులో బడిబాట ద్వారా 2,177మంది విద్యార్థులు చేరినట్లు విద్యాశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అత్యధికంగా ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 285మంది చేరగా.. ఇదే కాలనీ ప్రాథమిక పాఠశాలలో 137మంది, నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 100మంది చేరారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధన కొనసాగుతుండడం ప్రవేశాలు పెరగడానికి కారణంగా తెలుస్తోంది. ఇక ఖమ్మంలోని రుద్రంకోటలో రెండేళ్ల క్రితం మూతపడిన పాఠశాలను ఈఏడాది పునఃప్రారంభించగా 15మంది చేరారు. అలాగే, నిజాంపేట పాఠశాలలో ఐదుగురే విద్యార్థుల ఉండగా ఈసారి ఆ సంఖ్య 13కు చేరింది.

బడిబాటతో మంచి ఫలితం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకతలు, బోధన వివరాలను బడిబాట ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాం. దీంతో ప్రవేశాలు పెరిగాయి. విస్తృత ప్రచారంతో 100మంది చేరగా... మా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 337కు చేరింది.
– సుధారాణి, హెచ్‌ఎం, నయాబజార్ హైస్కూల్

అన్ని పాఠశాలల్లో పెరిగారు..



మండలంలోని అన్ని పాఠశాలల్లో గతంలో కంటే విద్యార్థుల సంఖ్య పెరిగింది. రుద్రంకోట స్కూల్‌ను పునఃప్రారంభించాం. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ముందస్తుగా ప్రచారం చేయడం ప్రవేశాలు పెరగడానికి దోహదపడింది.
– శైలజలక్ష్మి, ఎంఈఓ, ఖమ్మం అర్బన్

పశువుల పేరిట పరిహారం స్వాహా?

పోలీసులను ఆశ్రయించిన రైతు

తిరుమలాయపాలెం: గత ఏడాది వచ్చిన భారీ వరదతో తిరుమలాయపాలెం మండలంలోని రాకాసితండాలో పలువురు రైతులకు చెందిన పశువులు మృత్యువాత పడ్డాయి. అయితే, ప్రభుత్వం అందించిన పరిహారాన్ని ఇతరులు స్వాహా చేశారని ఓ రైతు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పశువులు కోల్పోయిన రైతుల వివరాలను తిరుమలాయపాలెం వెటర్నరీ డాక్టర్ ధ్రువీకరించాల్సి ఉండగా, ఆ డాక్టర్ భర్త సాయి యజమానులకు మంజూరైన పరిహారాన్ని తన ఖాతాలో జమ చేయించుకున్నట్లు తెలిసింది. ఆపై కొందరికి డబ్బులో సగమే ఇచ్చినట్లు సమాచారం. ఈమేరకు జర్పుల వెంకన్న తనకు రూ.79వేలు మంజూరైతే అందులో రూ.18వేలు ఇవ్వడం లేదంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఇంకా కొందరి పేరిట వచ్చిన నగదు కూడా పక్కదారి పట్టించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా రైతు ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

విపత్తులు ఎదుర్కొనేలా సన్నద్ధం

- వరద ఉధృతిని సమర్థంగా అంచనా వేయాలి
- ఎన్‌డీఎంఏ అధికారులతో భేటీలో కలెక్టర్ అనుదీప్

ఖమ్మంమయూరిసెంటర్: వరద విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొనేలా సన్నద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీ సమావేశం నిర్వహించగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఎన్‌డీఎంఏ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్, అధికారులు అభిషేక్ బిశ్వాస్, డాక్టర్ వజీం ఇక్బాల్, రాష్ట్ర డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ కన్సల్టెంట్లు గౌతంకృష్ణ తేజ, బి.అనుపమ, టీ.జీ.సంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది మున్నేటి వరదల సమయాన చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాక కలెక్టర్ మాట్లాడారు. ఈ ఏడాది వరద విపత్తు ఎదురైనా మరింత పకడ్బందీగా ఎదుర్కొనేలా అధ్యయనం చేస్తున్నామని, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వేగంగా తరలించేలా ఉద్యోగులు, ఆపదమిత్ర వలంటీర్లను సిద్ధం చేశామని తెలిపారు. అనంతరం ఎన్‌డీఎంఏ జాయింట్ అడ్వైజర్ నావల్ ప్రకాష్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: ఖమ్మం నగరం, రూరల్ మండలాల్లోని మున్నేటి లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం, ఏదులాపురం కమిషనర్లు అభిషేక్ అగస్త్య, ఆళ్ల శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. కాల్వొడ్డు మున్నేరు బ్రిడ్జి, బొక్కలగడ్డ, వినాయక నిమజ్జన ఘాట్ ప్రాంతం, ప్రకాష్‌నగర్, జలగంనగర్ తదితర ప్రాంతాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించిన వారు వరద అంచనా, స్థానికుల అప్రమత్తతపై చర్చించారు. జిల్లా కేంద్రంలో 1077 నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటైందనే విషయాన్ని స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, సీపీఓ ఏ.శ్రీనివాస్, ఆర్డీవో నర్సింహారావు, ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ పి.రాంప్రసాద్ పాల్గొన్నారు.



కాల్వొడ్డు వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ అనుదీప్

ఈవీఎం గోదాం తనిఖీ

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ అనుదీప్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతపై ఉద్యోగులకు సూచనలు చేశారు. కలెక్టరేట్ ఏఓ కే. శ్రీనివాసరావు, డీటీ అన్సారీ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెతో కేంద్రానికి కనువిప్పు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, వ్య వసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని.. తద్వారా ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో శుక్రవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక సమావేశం కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ మోదీ పాలనలో పదేళ్లుగా స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారన్నారు. ఫలితంగా పని గంటలు, పనిభారం పెరగడమే కాక యూనియన్లు పెట్టుకునే హక్కు కోల్పోవాల్సి వస్తోందని చెప్పారు. అంతేకాక కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న తీర్పులను బుట్టదాఖలు చేస్తుండగా, కార్మిక సంక్షేమం, సాంఘిక భద్రత, ఉపాధి, ఉద్యోగ రక్షణ కరువవుతున్నాయని తెలిపారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 9వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని వీరభద్రం పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, నాయకులు నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వర్‌రావు, బుగ్గవీటి సరళ, మాదినేని రమేష్, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం, పక్కన నాయకులు

రామాలయంలో సెక్యూరిటీ పటిష్టం

మెటల్ డిటెక్టర్ల ఏర్పాటు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సెక్యూరిటీ వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. రెండు డోర్ ఫ్రేమ్‌లతోపాటు మెటల్ డిటెక్టర్, ఆరు హ్యాండ్ హోల్డ్ మెటల్ డిటెక్టర్లను కొనుగోలు చేసి శుక్రవారం ఆలయంలో అమర్చారు. ఎస్పీఎఫ్ సిబ్బంది భక్తులను తనిఖీ చేసి వీటి ద్వారానే అనుమతించారు. ఈఈ రవీందర్ పర్యవేక్షించారు.

వస్త్ర దుకాణ టెండర్‌దారుడికి రూ.లక్ష జరిమానా

అన్యమత ప్రచారం చేసే కవర్లను దేవస్థానంలో వినియోగించినందుకు దేవస్థానం అధికారులు వస్త్ర దుకాణ టెండర్‌దారుడికి రూ.లక్ష జరిమానా విధించారు. నెల రోజుల క్రితం ఆంధ్రాకు చెందిన ఓ భక్త జంట స్వామివారి వస్త్రాలను ఆలయ ప్రాంగణంలో కొనుగోలు చేయగా, వాటిని ఆ దుకాణదారుడు కవర్‌లో పెట్టి ఇచ్చారు. అయితే, కవర్‌పై అన్యమత ప్రచార నినాదాలు ఉండడంతో భక్తులు ఈఓకు ఫిర్యాదు చేయగా ఏఈఓ శ్రవణ్‌కుమార్‌తో విచారణ జరిపించారు. ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా దుకాణదారుడికి ఈఓ రూ.లక్ష జరిమానా విధించారు.



డోర్‌ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ద్వారా వెళ్తున్న భక్తులు

'ఆమె'కు తొలి ఫలితం



ఇందిరా మహిళాశక్తి ద్వారా సమకూర్చిన పల్లెవెలుగు బస్సు

- మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దె బస్సులు
- నేడు మొదటి నెల అద్దె చెల్లించనున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 21 మండల సమాఖ్యలకు లబ్ధి

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి ద్వారా పలు అవకాశాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడమే కాక ఆ రుణంతో బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన అప్పగించారు. తద్వారా నెల వారీగా అద్దెతో రుణ వాయిదా చెల్లించి, మిగతా నగదును సభ్యులకు రుణం ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. బస్సు బకాయి తీరాక సంఘాలకే అద్దె మొత్తం అందనుంది. ఈమేరకు మే 20వ తేదీన ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన బస్సులు అప్పగించడంతో జూన్ 20వ తేదీ నాటికి ఒక నెలకు సంబంధించి అద్దెను సంస్థ తాజాగా విడుదల చేసింది. ఈ నిధులను సంఘాల వారీగా అధికారులు శనివారం అందించనుండడంతో తొలి ఫలితం దక్కనుందని మహిళా సంఘాల సభ్యుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో 21 బస్సులు..

టీజీఎస్ ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన ఇచ్చేలా మండల సమాఖ్యల ద్వారా బస్సులు కొనుగోలు చేయించారు. ఉమ్మడి జిల్లాలో 31 సంఘాలకు తొలిదశలో అవకాశం కల్పించగా ఇప్పటి వరకు 21 బస్సులను సమకూర్చారు. ఖమ్మం జిల్లాలో 19, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు మండల సమాఖ్యల ద్వారా రూ.36 లక్షల చొప్పున ఒక్కో బస్సు కొనుగోలు చేశారు. ఆర్టీసీ ద్వారా అందే అద్దెను ఏడేళ్ల పాటు(84నెలలు) మండల సమాఖ్యల ద్వారా జిల్లా సమాఖ్య లేదా రుణం జారీ చేసిన బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది.

ఈఎంఐ చెల్లింపులు, వినియోగం

ఆర్టీసీ ప్రతి నెలా 21నుంచి 25వ తేదీ మధ్య మండల మహిళా సమాఖ్యల ఖాతాల్లో అద్దె జమ చేస్తుంది. ఒక్కో బస్సుకు అద్దె రూపంలో రూ.69,468 జమ చేయనుండడంతో ఇందులో రూ.50వేలను కిస్తీగా చెల్లించాలి. మిగతా రూ.19,468 నగదును మహిళా సమాఖ్యల ఖాతా ద్వారా అవసరాలకు అనుగుణంగా సభ్యులు రుణంగా తీసుకోవచ్చు. కాగా, ఆర్టీసీ యాజమాన్యం బస్సులకు సంబంధించిన తొలి నెల అద్దె విడుదల చేయడంతో ఉమ్మడి జిల్లాలోని మహిళా సమాఖ్యల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది..



మండల సమాఖ్య ద్వారా బస్సు కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాం. సంస్థ నుండి తొలి నెల అద్దె విడుదల చేయడం ఆనందంగా ఉంది. నెలనెలా అద్దె వస్తే ఈఎంఐ కడుతూ బాకీ తీరుస్తాం. మిగిలిన నగదుతో మా సమాఖ్యలోని సభ్యులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. – మరియమ్మ, వైరా మండల సమాఖ్య అధ్యక్షురాలు

క్లుప్తంగా

ఏపీపీగా బాధ్యతలు స్వీకరించిన శరత్



జిల్లా జడ్జి రాజగోపాల్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శరత్

ఖమ్మం లీగల్: ఖమ్మం ఒకటో అదనపు సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా జమ్ముల శరత్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రాసిక్యూషన్ డీడీ కార్యాలయంలో నియామకపత్రం అందజేశాక జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, న్యాయమూర్తి ఉమాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయవాదులు నిరంజన్ రెడ్డి, హరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సంపత్, హేమంత్, శేఖర్, జానీ పాల్గొన్నారు.

నేడు ఐఏఎల్ అవగాహన సదస్సు

మధిర/ఖమ్మంలీగల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఆధ్వర్యాన శనివారం మధిరలో జరగనున్న న్యాయవాదుల అవగాహన తరగతులకు హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరు కానున్నారని న్యాయవాది వాసిరెడ్డి వెంకటేశ్వరరావు తెలిపారు. మధిరలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో వచ్చిన మార్పులపై న్యాయవాదులకు అవగాహన కల్పించాలనే భావనతో ఈ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఈసందర్భంగా కొత్తగా అమల్లోకి వచ్చిన చట్టాలు, మార్పులపై జస్టిస్ బి.చంద్రకుమార్ బోధిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఐఏఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుల్లారావు, జె.రమేష్‌తో పాటు కాపూరి రమేష్, తేలపోలు వెంకట్రావు, జీ.వీ.లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు, డి.జగన్మోహన్‌రావు, కోట జ్ఞానేష్, సీహెచ్.రామరాజు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

900 గ్రాముల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న గంజాయిని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. ఎస్ఐ సంధ్య ఆధ్వర్యాన తనిఖీ చేస్తుండగా.. కొత్తగూడెంకు చెందిన మోహిత్ గంజాయి అమ్ముతూ కొత్త బస్టాండ్ సమీపంలోని గుట్టపై పట్టుబడ్డాడు. ఆయన నుంచి రూ.30వేల విలువైన 900 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకోవడమే కాక కొనుగోలుకు వచ్చిన గోపాలపురం, జహీర్‌పురవాసులు బాదావత్ ప్రవీణ్, దూర్ సందీప్, దోస్వాన్ సాయివినయ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

రహ‘దారి’ కష్టాలు



మూసేసిన పాత బ్రిడ్జి పక్కన కొనసాగుతున్న తీగల వంతెన నిర్మాణం



కాల్వొడ్డు వద్ద వరద ఉధృతితో కొట్టుకుపోయిన చప్టా

- మున్నేటిపై కాల్వొడ్డు బ్రిడ్జి మూసివేత
- ఫలితంగా భారమంతా రాపర్తినగర్‌పైనే...
- వాహనాల రద్దీతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో కాల్వొడ్డు వద్ద మున్నేటిపై పాత బ్రిడ్జి మీదుగా రాకపోకలు నిలిచిపోవడం, ఆ పక్కనే లోలెవల్ చప్టాపైకి వరద నీరు చేరగా వాహనాలను అనుమతించకపోవడం జిల్లా కేంద్రంలో వాహనదారులకష్టాలకు కారణమవుతోంది. ఖమ్మం నుంచి సూర్యాపేట, వరంగల్, కోదాడ, జగ్గయ్యపేట వైపు వెళ్లేందుకు మున్నేటిపై మూడు చోట్ల బ్రిడ్జిలు నిర్మించారు. కాల్వొడ్డు వద్ద వందేళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి ప్రక్కనే ప్రస్తుతం తీగల వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో పాత బ్రిడ్జి మీదుగా వాహనాల రాకపోకలను కొ న్నాళ్లుగా నిలిపివేశారు. ప్రకాశ్‌నగర్‌లోఇంకో బ్రిడ్జి ఉన్నప్పటికీ అది దూరాభారం కావడంతో వాహనదారులంతా రాపర్తినగర్ బ్రిడ్జి వచ్చివెళ్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం ఇక్కడ తీవ్ర రద్దీ నెలకొని గంటల తరబడి ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి.

నత్తనడకన తీగల వంతెన నిర్మాణం

మున్నేటిపై ఉన్న మూడు బ్రిడ్జిల్లో కాల్వొడ్డు బ్రిడ్జి కీలకంగా నిలుస్తోంది. ఇదినగరంలోని ప్రధాన ప్రాంతాలను కలుపుతూ నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. అయితే ఈ బ్రిడ్జి పక్కనే రూ.180 కోట్ల వ్యయంతో తీగల వంతెన నిర్మిస్తున్నారు. ఈ పనులకు ఆటంకం ఎదురుకావొద్దని పాత బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేశారు. అయితే, తీగల వంతెన నిర్మాణం 2023లో మొదలుపెట్టగా 2026 జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు 45శాతం పనులే పూర్తయ్యాయి. ప్రస్తుతం వర్షాలు మొదలవడంతో పనులు నత్తనడకన సాగుతుండగా.. పాత బ్రిడ్జి పక్కన లోలెవల్ చప్టాపైకి ఇటీవల వరద చేరి ద్విచక్రవాహనాలు వచ్చివెళ్లేందుకు అనువుగా ఉన్న రోడ్డు కాస్త కొట్టుకుపోయింది. దీంతో వాహనదారులంతా నగరంలోకి రావాలన్నా.. వెళ్లాలన్నా అవస్థ పడక తప్పడంలేదు.

రాపర్తినగర్‌పైనే భారమంతా..

కాల్వొడ్డు బ్రిడ్జి మూసివేయడడం.. ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి దూరం కావడంతో ఖమ్మం నుంచి ఇతర ప్రాంతాలకు వచ్చివెళ్లే వాహనాలన్నీ రాపర్తినగర్ బ్రిడ్జి వైపునకు వస్తున్నాయి. సహజంగా రద్దీ ఉండే ఈ బ్రిడ్జిపై ఇప్పుడు మరింత భారం పడడంతో ఉదయం, సాయంత్రం కిలోమీటర్ల మేర వాహనాలు బారులు దీరుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, భారీ వాహనాలన్నీ వస్తుండడం.. బ్రిడ్జి వెడల్పు చాలా తక్కువగా ఉండడంతో సమస్యకు కారణమవుతోంది. భారీ వాహనాలు, కంటైనర్లు వచ్చినప్పుడు బ్రిడ్జి దాటే వరకు అటు కరుణగిరి, ఇటు రాపర్తినగర్ వైపు మిగతా వాహనాలను నిలిపివేస్తుండడంతో వాహనదారులు కష్టాలు మరింత పెరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం రెండు లారీలు ఢీకొనడంతో సుమారు రెండు గంటల పాటు వాహనాలన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చివరకు కొన్ని వాహనాలను దారి మళ్లించి జెడ్పీ సెంటర్ మీదుగా ప్రకాశ్‌నగర్ బ్రిడ్జి వైపు పంపించారు.

పాత బ్రిడ్జిపై అనుమతించాలి..



తీగల వంతెన నిర్మాణం పేరుతో పాత బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. రాపర్తినగర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్ అవుతోంది. కాల్వొడ్డు వద్ద పాత బ్రిడ్జిపై వాహనాలు అనుమతిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది.

– వై.విక్రమ్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి, సీపీఎం

ప్రమాదాలు జరుగుతున్నాయి..



వాహనాలన్నీ రాపర్తినగర్ వైపు వస్తుండడంతో రద్దీ పెరిగింది. త్వరగా వెళ్లాలని ఆటోలు, ద్విచక్ర వాహనదారులు చిన్నచిన్న సందుల్లోకి వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పాత బ్రిడ్జిని పునరుద్ధరించి ట్రాఫిక్ ఇక్కట్లు తొలగించాలి.

– సైదా, సీపీఐ నాయకుడు

ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

హోటళ్లు, స్వీట్ షాపుల్లో హానికర రంగులు, కాలం చెల్లిన పదార్థాల సీజ్



స్వీట్ షాప్‌లో హానికరమైన రంగులను చూపిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని పలు రెస్టారెంట్లతో పాటు మసాలా దినుసులు, పచ్చళ్ల తయారీ కేంద్రాలు, స్వీట్స్ షాపుల్లో రాష్ట్రఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం తనిఖీలు చేపట్టింది. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి ఆధ్వర్యాన టాస్క్‌ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, పి.స్వాతి, శ్రీషిక, సీహెచ్.లోకేష్, శరత్‌తో కూడిన బృందం ఖమ్మం వైరా రోడ్డులోని పీఎస్‌కే ఫుడ్స్ అండ్ స్పైసెస్, ఎన్టీఆర్ సర్కిల్‌లోని జీ.పీ.రెడ్డి స్వీట్ షాప్, ఐస్‌క్రీమ్ యూనిట్, పాలమూరు గ్రిల్స్ రెస్టారెంట్లలో తనిఖీ చేశారు.

కాలం చెల్లిన పదార్థాలు, హానికర రంగులు

పాలమూరు గ్రిల్స్ రెస్టారెంట్‌లో వంటగది అపరిశుభ్రంగా ఉండడం, రిఫ్రిజిరేటర్, కోల్డ్ చాంబర్‌లో నిర్ణీత ఉష్ణోగ్రత లేవని అధికారులు గుర్తించారు. ఈసందర్భంగా ఆహార పదార్థాల తయారీలో ఉపయోగించే సామగ్రి, కూరగాయలు సరిగ్గా లేకపోవడంతో వాటిని ధ్వంసం చేసి నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు. అలాగే, పీఎస్‌కే ఫుడ్స్ అండ్ స్పైసెస్‌లో సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోగా, ప్లాస్టిక్ డ్రమ్ముల్లో పచ్చళ్లు నిల్వ చేయడం, ముడి సరుకులపై ఈగలు ఉండడాన్ని గుర్తించి శాంపిళ్లు సేకరించడమే కాక నోటీసులు జారీ చేశారు. అలాగే, వైరా రోడ్డులోని ఐబాకో ఐస్‌క్రీమ్ యూనిట్‌లో సరైన పేరుతో లైసెన్స్ లేకపోగా, అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో నోటీసు ఇచ్చారు. అంతేకాక జీపీ రెడ్డి స్వీట్స్‌లో అపరిశుభ్ర వాతావరణంలో కేక్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు, కేక్‌లు, స్వీట్ల తయారీలో హానికర రసాయనాలు కలిగిన రంగులు కలుపుతున్నారని తేల్చారు. ఈమేరకు అనుమానిత సామగ్రిని సీజ్ చేసి నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

ఇన్ఫోసిస్‌కు ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ కృష్ణ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ లిమిటెడ్‌కు ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాల విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారు. ఈమేరకు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ శుక్రవారం వారిని అభినందించి మాట్లాడారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యాంపస్ పూల్ డ్రైవ్‌లో తమ విద్యార్థులు ఎంపికవగా.. వారికి ఆరు నెలల శిక్షణలో రూ.3.60 లక్షల చొప్పున, ఆతర్వాత రూ.9 లక్షల పైచిలుకు వార్షిక వేతనం అందుతుందన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏ.వీ.వీ.శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎన్.శ్రీనివాసరావు, టీపీఓ ఎస్.సవిత, కోఆర్డినేటర్ జి.ప్రభాకర్ పాల్గొన్నారు.

అన్నదమ్ములను బలితీసుకున్న మున్నేరు

ఇసుక కోసం తవ్విన గుంతల్లో మునిగి మృతి



నాగగోపి (ఫైల్)



నందకిశోర్ (ఫైల్)

చింతకాని: ద్విచక్ర వాహనాలను శుభ్రం చేసేందుకు మున్నేటిలోకి దిగిన అన్నదమ్ములు గుంతలను గుర్తించకపోవడంతో నీట మునిగి మృతి చెందారు. చేతికొచ్చిన కుమారుడొకరు.. ఇంజనీర్ చేయాల్సి ఇంకో కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. చింతకాని మండలం చిన్నమండవలో శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాశీమల వెంకటి – సుభద్ర దంపతులకు ముగ్గురు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు నాగగోపి(22), చిన్నకుమారుడు నందకిశోర్(18) గ్రామానికే చెందిన గంటెల ప్రవీణ్, మోచర్ల రాజ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం మూడు ద్విచక్ర వాహనాలను శుభ్రపరిచేందుకు సమీపంలోని మున్నేటి వద్దకు వెళ్లారు. వాహనాలను శుభ్రం చేశాక స్నానానికి మున్నేటిలో దిగిన వారు ఇసుక కోసం తవ్విన గుంతలను గుర్తించక మునగసాగారు. ఈక్రమాన కేకలు వేస్తుండడంతో సమీపాన చేపలు పడుతున్న పట్టా బుజ్జిబాబు చేరుకుని ప్రవీణ్, రాజ్‌కుమార్‌ను బయటకు లాగాడు. మరింత లోతుకు వెళ్లిన నాగగోపి, నందకిశోర్‌ను కాపాడే పరిస్థితి లేకపోవడంతో గ్రామస్తులు చేరుకుని సుమారు మూడు గంటల పాటు గాలించినా ఫలితం దక్కలేదు. చివరకు తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎస్ఐ నాగుల్‌మీరా ఖమ్మంలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలకు సమాచారం ఇవ్వగా.. అప్పటికే చీకటి పడడంతో కొందరు యువత మరింత లోతుకు వెళ్లి వెతకడంతో మృతదేహాలు లభ్యమయ్యాయి. నాగగోపి హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ పూర్తిచేయగా, నందకిశోర్ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు సిద్ధమవుతున్నాడు. చేతికొచ్చిన కుమారులు ఒకే ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో లష్కర్ మృతి



అప్పయ్య (ఫైల్)

బోనకల్: మండలంలోని రావినూతల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లష్కర్ మృతి చెందాడు. కలకోటకు చెందిన యంగల అప్పయ్య (50) గతంలో వీఆర్‌ఏగా పనిచేయగా, ఇటీవల ఇరిగేషన్ శాఖలో బోనకల్ సబ్ డివిజన్ పరిధిలో లష్కర్‌గా నియమితులయ్యాడు. విధి నిర్వహణలో భాగంగా స్వగ్రామం నుంచి బోనకల్ వైపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గేదె అడ్డు రావడంతో సుబాబుల్ లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొని కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. అప్పయ్య భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా, కేసు నమోదు చేశామని ఎస్సై పి.వెంకన్న తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మృతి



శ్రీనివాస్ (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేటకు చెందిన సానబోయిన శ్రీనివాస్(52) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందాడు. గురువారం రాత్రి ఆయన ఖమ్మం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా ద్విచక్ర వాహనంపై నాయుడుపేట సర్కిల్‌లోని తన దాబా వద్దకు వస్తున్నాడు. మార్గమధ్యలో కొత్తూరు వద్ద ద్విచక్రవాహనాన్ని రోడ్డు పక్కన ఆపి మూత్రవిసర్జన చేసి తిరిగి వాహనం స్టార్ట్ చేసే సమయాన ఖమ్మం వైపు నుంచి వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. శ్రీనివాస్ టీడీపీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతుండగా, ఆయన మృతదేహం వద్ద పార్టీ నాయకులు డాక్టర్ వి.రామనాథం, కూరపాటి వెంకటేశ్వర్లు, కొండబాల కరుణాకర్, ఆరెకట్ల కొండల్‌రావు, కర్నాటి సీతారాములు, తాత సుధాకర్, రావుట్ల సత్యనారాయణ నివాళులర్పించారు.

మైనర్‌పై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: మైనర్‌పై అత్యాచారం చేసిన కేసులో సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన నిందితుడు మామిడి పాపారావుకు ఇరవై ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తీర్పు వివరాలిలా ఉన్నాయి. కొత్తూరుకు చెందిన బాలిక 2023 ఆగస్టు 13న తన ఇంటి ముందు స్నేహితులతో ఆడుకుంటుండగా పాపారావు చాక్లెట్లు కొనిస్తానని చెప్పి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో పాప రోదిస్తూ తన తల్లికి చెప్పగా ఆమె సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు పాపారావుకు 20ఏళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలని న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డీ. ఇర్షాద్ వాదించగా, సిబ్బంది రవికుమార్, శ్రీకాంత్, చిట్టిబాబు సహకరించారు.

అంతర్ రాష్ట్ర దొంగలు అరెస్ట్

ఖమ్మంక్రైం: వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన సంపంది రాజేందర్, అలకుంట మహేష్‌తో పాటు ఎర్రుపాలెంకు చెందిన ఫణీందర్ 2024 డిసెంబర్‌లో ఖమ్మం నయాబజార్‌లోని ఓ ఇంట్లో చోరీ చేశారు. ఆ సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేశామని సీఐ మోహన్‌బాబు తెలిపారు. వీరి నుంచి రూ.8లక్షల విలువైన సొత్తు చేసుకున్నట్లు వెల్లడించారు. కాగా, నిందితులు ఏపీలోని సామర్లకోట, అల్లవరం, అమలాపురంతో పాటు ఖమ్మం , మధిర, వైరా, రఘునాథపాలెం, మధిర రూరల్ పీఎస్ పరిధిలో చోరీలకు పాల్పడ్డారని తెలిపారు.